క్లుప్తంగా

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తాం..

వీరఘట్టం: మండలంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎంఈఓ డి.గౌరినాయుడు అన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల పిల్లల ఫీజు రీఇంబర్స్‌మెంట్ కోసం వెంటనే దరఖాస్తు చేయాలని సూచించారు. మిగులు ఉపాధ్యాయులను ఎక్కువ మంది విద్యార్థులు ఉండి సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేయనున్నట్లు చెప్పారు. అలాగే పాఠశాలల్లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామన్నారు.

ఘనంగా చర్చి వార్షికోత్సవం


దేవునికి సత్ప్రసాదం సమర్పిస్తున్న ఫాదర్‌లు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని పరిశుద్ధ శిలువ దేవాలయం(చర్చి) 26వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. సవర కోటపాడు విచారణ గురువు, ఫాదర్ చార్లెస్ తొలిపూజ చేపట్టి, ఏసుక్రీస్తు సందేశాన్ని తెలియజేశారు. సర్వమానవాళి శ్రేయస్సుకు, ప్రపంచ శాంతికి ప్రతిఒక్కరూ శాంతి, సమాధానాలతో జీవించాలన్నారు. మండల కేంద్రంతో పాటు ఎల్విన్‌పేట, సవర కోటపాడు, లక్కగూడ, కొండవారిగూడ, పి.లేవిడి తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి, ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఫాదర్‌లు తోమస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పందెంరాయుళ్ల అరెస్ట్


పట్టుకున్న పొట్టేళ్లు, పందెంరాయుళ్లతో పోలీసులు

వీరఘట్టం: మండలంలోని వండువ శివారు తోటల్లో జరుగుతున్న పొట్టేళ్ల పందాలపై ఎస్‌ఐ జి.కళాధర్ సిబ్బందితో కలిసి శనివారం తెల్లవారుజామున దాడి చేశారు. ఈ దాడిలో రెండు పొట్టేళ్లతో పాటు ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.3,200 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ


ప్రసాదరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: మండలంలోని కోడిశ పంచాయతీ తొత్తడి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త ప్రసాదరావు తల్లి ఇటీవల మరణించడంతో ఆ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం పరామర్శించారు. ప్రసాదరావును ఓదార్చి ధైర్యం చెప్పారు. పార్టీ తరఫున తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆమె వెంట సర్పంచ్ తిరుపతిరావు, సింహాచలం, కృష్ణ, తదితరులు ఉన్నారు.

హిందీ భాషపై పట్టుసాధించాలి


హిందీ భాష విశిష్టతను వివరిస్తున్న హెచ్‌ఎం సూర్యనారాయణ

పాలకొండ రూరల్: హిందీపై పట్టు సాధించాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం మీసాల సూర్యనారాయణ అన్నారు. పాఠశాలలో శనివారం హిందీ భాషా దినోత్సవాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయిని సులోచనారాణి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి హిందీ భాషపై మక్కువతో అభ్యసించటం ద్వారా భాషపై పట్టుసాధించవచ్చన్నారు. ఉపాధ్యాయులు బౌరోతు శంకరరావు హిందీ, సాంస్కృతం, తెలుగు భాషల మధ్య సారుప్యతను వివరించారు.

నేరడి బ్యారేజి వద్ద ఇసుక డంపింగ్


ఇసుక డంపింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శేఖరం, ఆర్‌ఐ రాంబాబు

భామిని: జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో కాట్రగడ–బి ఓపెన్ హెడ్ చానల్ సైడ్ వియ్యర్‌లో పేరుకు పోయిన ఇసుక మేటలు తొలగింపు పనులు పకడ్బందీగా సాగుతున్నాయి. తహసీల్దార్ నిమ్మల శేఖరం, ఆర్‌ఐ ఎస్.రాంబాబు శనివారం పనులను పర్యవేక్షించారు. ఓపెన్ హెడ్ చానల్ నుంచి తీసిన ఇసుకను టిప్పర్ల ద్వారా నేరడి బ్యారేజ్ వద్ద ఏర్పాటుచేసిన డంపింగ్ యార్డ్‌కు తరలించారు. ఏబీ రోడ్డు నుంచి డంపింగ్ పాయింట్‌కు వెళ్లే దారిలో సీసీ కెమెరాలు, చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. పూర్తిస్థాయి ఇసుక నిలువలు చేరాక జిల్లా అధికారుల ఆదేశాలతో అమ్మకాలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.


పాలకొండ రూరల్: పాలకొండ–పార్వతీపురం ప్రధాన రహదారి దుస్థితి ఇలా..


భామిని: గురండి కూడలి వద్ద ఏబీ రోడ్డులో ఏర్పడిన గోతులు


కొమరాడ: గుమడ ప్రధాన రహదారిలో గోతిలో దిగబడిన లారీ

ప్రమాదకరంగా రహదారి గుంతలు

పాలకొండ రూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో పాలకొండ నియోజకవర్గం పరిధిలోని పలు రహదారులు ఛిద్రమయ్యాయి. పాలకొండ–సీతంపేట రహదారిలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ క్యాంపు కార్యాలయం వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో వర్షపునీరు నిల్వ ఉండటంతో వాహన చోదకులు వాటిని గమనించక ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే పాలకొండ–పార్వతీపురం రహదారిలో గజాలాఖానా వద్ద ఇదే పరిస్థితి నెలకొంది. నిత్యం నియోజకవర్గ ఎమ్మెల్యే ఇదే మార్గంలో ప్రయాణం చేస్తున్నా.. రోడ్డుపై గుంతలు గుర్తించి మరమ్మతులకు చేయించకపోవడంపై ప్రయాణికులు, స్థానికులు విమర్శలు చేస్తున్నారు. మరోవైపు ఇదే రహదారిలో పలువురు రైతులకు చెందిన వరి పొలాలు నీట మునిగాయి. ప్రస్తుతం నీరు బయటకు వెళ్లినప్పటికి ఇసుక, బురద మేట వేయటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఉచిత పంటల బీమా, ఈకేవైసీ తదితర అంశాల్లో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో అన్నదాతలు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని వారంతా కోరుతున్నారు.


పాలకొండ రూరల్: ఇటీవల కురిసిన వర్షాలకు ఛిద్రమైన పాలకొండ–సీతంపేట రహదారి

రాళ్లుతేలిన రహదారి

సీతంపేట: ఏజెన్సీలో మారుమూల గ్రామమైన ఎగువద్వారబందం రహదారి ఇటీవల కురిసిన వర్షాలకు పూర్తిగా కొట్టుకుపోయింది. నడిమిద్వారబందం నుంచి ఈ గ్రామానికి రెండు కిలోమీటర్ల ఉంటుంది. గతంలో పూర్తిగా రోడ్డు నిర్మించలేదు. అయితే ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు మార్గం ఉండేది. వర్షాలకు రోడ్డు కొట్టుకుపోవడంతో వాహనాలు వెళ్లేందుకు వీలులేని పరిస్థితి. దీంతో అత్యవసర సమయాల్లో ఈ రోడ్డులో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు అవస్థలు పడుతున్నారు. సందిగూడ రహదారి పరిస్థితి కూడా ఇలానే ఉంది.

గోతులతో నిండిన ఏబీ రోడ్డు

భామిని: మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు ఏబీ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతల్లో వర్షపునీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. ఏబీ రోడ్డులో ప్రయాణం వాహన చోదకులకు నరకయాతనగా మారింది. మరోవైపు వరద కాలువ గట్లు కోతకు గురికావడంతో వరి, పత్తి, మొక్కజొన్న, తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?

కొమరాడ: పార్వతీపురం నుంచి కొమరాడ మండలం మీదుగా ఒడిశా వైపు వెళ్లే అంతర్‌రాష్ట్ర రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. పెద్ద పెద్ద గుంతలు, మట్టి, బురదతో ఉండడంతో ఆ దారిలో వెళ్లే వారంతా తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు వరదనీరు, మట్టితో గోతులు నిండి ఉండడంతో వాటిల్లో భారీ వాహనాలు దిగబడిపోయి ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది. దీంతో ఆ దారిలో తరచూ ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, రోడ్డును బాగు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


సీతంపేట: ఎగువద్వారబందం రోడ్డు దుస్థితి


కొమరాడ: కూనేరు ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు


కొమరాడ: గుమడ వద్ద బురదమయమైన రోడ్డులో వాహనదారుల అవస్థలు

పంచాయతీ స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నం


పంచాయతీ కాలువపై వేసిన సిమెంట్ పలకలు, గోడ కట్టేందుకు సిద్ధం చేసిన సిమెంటు ఇటుకలు


గోడ కట్టేందుకు చూస్తున్న పంచాయతీ స్థలం ఇదే

● చోద్యం చూస్తున్న అధికారులు

వీరఘట్టం: స్థానిక మేజరు పంచాయతీలోని అందవరపువీధి శివారున తూర్పు వైపు నుంచి ప్రధాన రహదారికి వెళ్లేందుకు పూర్వం నుంచి 3 అడుగుల సందు ఉండేది. అయితే వీధికి శివారున ఆరు నెలల కిందట నూతనంగా ఓ భవన నిర్మాణం చేపట్టారు. వీధి శివారున 3 అడుగుల దారి గుండా మురుగు కాలువ ఉండడంతో దానిపై సిమెంట్ పలకలు వేశారు. అంతేకాకుండా భవన యజమాని డాబా పైకి వెళ్లేందుకు వీలుగా కాలువ మీదుగా ఇనుప నిచ్చెన ఏర్పాటుచేశారు. ఇన్నాళ్లు ఎవరూ ప్రశ్నించకపోవడంతో వీధి శివారున ఉన్న సందును కూడా ఆక్రమించేందుకు రెండు రోజుల క్రితం గోడ కట్టేందుకు పూనుకున్నాడు. ఆ ప్రయత్నాలను స్థానికులు అడ్డుకున్నారు. పంచాయతీ దారిని ఆక్రమించి గోడ కడితే ఊరుకునేది లేదని హెచ్చరించడంతో ఆ నిర్మాణం నిలిచిపోయింది. ఆక్రమణలపై పంచాయతీ అధికారులు దృష్టి సారించి పంచాయతీ దారిని పరిరక్షించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ ఈఓ రవి వద్ద ప్రస్తావించగా తక్షణమే పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

● మేరా భారత్ మహాన్


హిందీ దీవస్‌ను పురస్కరించుకుని శనివారం స్థానిక గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థినులు ఇండియా మ్యాప్ ఆకారంలో ఆసనాలు వేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.పద్మశ్రీ, హెచ్‌డబ్ల్యూవో పి.అమల, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు. - సీతంపేట

దొంగ దొరికాడు..

బొబ్బిలి: పట్టణంలో తన ఎలక్ట్రిక్ స్కూటీ పోయిందని ఓ వ్యక్తి ఫిర్యాదు చేసిన కొన్నిగంటల వ్యవధిలోనే పోలీసులు దొంగను పట్టుకుని, స్కూటీని యజమానికి అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామానికి చెందిన వాసుదేవరావు స్థానిక పట్టణంలోని ఆర్‌టీసీ కాంప్లెక్స్ ఆవరణలో శనివారం తన స్కూటీని నిలిపి ఉంచి, అక్కడి దగ్గరలోని ఓ చోటకు వెళ్లాడు. కాసేపటి తర్వాత వచ్చి చూసేసరికి వాహనం కనిపించకపోవడంతో లబోదిబోమని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశామన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా, జమ్మడవలస గ్రామానికి చెందిన గొట్టాపు రామకృష్ణ అనే వ్యక్తి ఆ స్కూటీని దొంగిలించినట్లు గుర్తించి, పట్టుకుని అరెస్ట్ చేశామని ఎస్‌ఐ రమేష్‌కుమార్ తెలిపారు. ఆ స్కూటీని యజమానికి అప్పగించామన్నారు.

స్థల పరిశీలన


స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం: ఇన్నోవేషన్ హబ్ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని స్థానిక ఎస్‌వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ శనివారం పరిశీలించారు. సర్వే నంబర్ 249/1లోని 1.34 ఎకరాల స్థలాన్ని గుర్తించినట్లు ఆర్డీఓ కె.హేమలత తెలిపారు. గుర్తించిన స్థలం అనువుగా ఉండడంతో విద్యార్థులకు ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ కోర్సులకు సంబంధించి ప్రయోగశాలలను ఏర్పాటు చేయడంతో పాటు సాంకేతిక ఆవిష్కరణలకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా చుట్టూ పార్క్ అభివృద్ధి చేస్తామన్నారు. పరిశీలనలో ఉప తహసీల్దార్ టీవీ రమణ, గిరిజన సంక్షేమ శాఖ డీఈ డి.గౌరునాయుడు, కళాశాల అధ్యాపకులు గుప్త, ఆర్‌ఐ వి.రామకృష్ణ, సర్వేయర్ కై లాసం, వీఆర్‌ఓ గంగరాజు, తదితరులున్నారు.

ఘనంగా లక్ష పత్రి పూజ

బలిజిపేట: మండలంలోని వెంగాపురం అగ్రహారంలో ఏర్పాటు చేసిన వినియక మండపంలో శనివారం స్వామివారికి లక్షపత్రి పూజ ఘనంగా నిర్వహించారు. అర్చకులు కె.గోపాలకృష్ణ, కె.ఫణికుమార్ శర్మ పూజా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే స్వామివారికి లక్ష నామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

సామూహిక కుంకుమ పూజలు..

పార్వతీపురం: మండలంలోని సంగంవలస కూరాకుల వీధిలో వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అర్చకుడు పి. శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో మహిళలకు అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

న్యూట్రీ గార్డెన్ పరిరక్షణకు చర్యలు

సాక్షి ఎఫెక్ట్...

వీరఘట్టం: ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్స్ ఏర్పాటుకు చేపట్టిన 'మనబడి–మనతోట' కార్యక్రమం సరైన పర్యవేక్షణ లేక మసకబారుతోంది. వీరఘట్టం బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 4న చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పాల్గొని విత్తనాలు చల్లి, మొక్కలు నాటారు. అయితే కలెక్టర్ వెళ్లిన తరువాత న్యూట్రీ గార్డెన్‌పై పర్యవేక్షణ లేకపోవడంతో పూర్తిగా ఎండిపోయింది. దీనిపై శనివారం సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనంపై రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ వివరణ కోరారు. దీంతో ఆర్జేడీ, డీఈఓ, డిప్యూటీ డీఈఓలు మండల విద్యాశాఖ అధికారి డి.గౌరినాయుడుకి ఫోన్ చేసి వివరాలు తెలియజేయాలని ఆదేశించారు. ఆయన వెంటనే బాలుర ఉన్నత పాఠశాలను సందర్శించి హెచ్‌ఎం బి.సాంబురుతో కలిసి న్యూట్రి గార్డెన్‌ను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు న్యూట్రీ గార్డెన్‌లో వేసిన విత్తనాలు కొట్టుకుపోయాయని, అక్కడక్కడా చిన్న మొక్కలు ఉన్నట్లు గుర్తించారు. మిగిలిన మొక్కలను పరిరక్షించాలని ఎంఈఓ సూచించారు. వారితో పాటు యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు ఉన్నారు.


బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన న్యూట్రీ గార్డెన్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ గౌరినాయుడు

గ్రామాల్లో గణేశ్ ఉత్సవాల సందడి

వీరఘట్టం: స్థానిక ముచ్చర్లవీధిలో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం గణనాథునికి విశేష పూజలు చేశారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

వినాయక లడ్డూ వేలం

పాలకొండ: పట్టణంలోని ఆంజనేయనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయ మండపం వద్ద స్వామి వారి లడ్డూను శనివారం వేలం వేశారు. కాలనీకి చెందిన గార ఆనందరావు రూ.10 వేలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. అనంతరం గణనాథుని తిరువీధి, నిమజ్జనోత్సవాన్ని నిర్వహించారు.

ఉత్సాహంగా నిమజ్జనాలు

భామిని: మండలంలో బత్తిలి, కాట్రగడ, నేరడి–బి, లోహరిజోల, భామిని, ఘనసరలలో గణనాథుని నిమజ్జనోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. మేళతాళాలతో గణనాథుని తిరువీధి నిర్వహించారు. యువత, మహిళలు, చిన్నారులు నృత్యాలు చేస్తూ సందడి చేశారు. వంశధార నదిలో వినాయక ప్రతిమలను నిమజ్జనం చేశారు.


భామిని: బత్తిలి చిన్నవీధిలో వినాయకుని ఊరేగింపు

అన్న సంతర్పణ

వీరఘట్టం: స్థానిక కూరాకులవీధిలో వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా శ్రీకృష్ణా సేవా సంఘం సభ్యులు శనివారం అఖండ అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

పాలకొండ రూరల్: పట్టణంలోని పెద్దకాపువీధిలో కొలువైన గణపతి మండపంలో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. చిన్నకాపువీధిలో సామూహిక కుంకుమ పూజలు, మహాన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. కొత్తవీధిలో గణపతి నిమజ్జనోత్సవాన్ని వైభవంగా చేపట్టారు. ఈ క్రమంలో నిర్వహించిన లడ్డూ ప్రసాదాన్ని గెంబలి సంతోష్‌కుమార్ రూ.10,116కి వేలంలో దక్కించుకున్నారు. శోభాయాత్రలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై కె.ప్రయోగమూర్తి సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.


పాలకొండ రూరల్: చిన్నకాపువీధిలో నిమజ్జనోత్సవంలో కోలాటం ఆడుతున్న చిన్నారులు


వీరఘట్టం: గణనాథునికి కుంకుమ పూజలు చేస్తున్న దంపతులు


పాలకొండ: వేలంలో సొంతం చేసుకున్న లడ్డూతో భక్తులు


వీరఘట్టం: కూరాకులవీధిలో అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

కూటమి ప్రభుత్వంలో కదలిక


కాట్రగడలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న వ్యవసాయ సహాయకుడు

భామిని: ఈ–పంట నమోదుపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రశ్నించడంతో కూటమి ప్రభుత్వంలో కదలిక వచ్చింది. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. రైతులతో మాట్లాడి వారి కష్టాలు, సమస్యలు తెలుసుకున్నారు. వర్షాలకు పంటలు నీట మునిగిపోయాయని, వ్యవసాయశాఖ అధికారులు ఈ–క్రాప్‌లో నమోదు చేయకపోవడంతో తమకు పరిహారం అందని పరిస్థితి నెలకొందని రైతులు వాపోయారు. ఈ సందర్భంగా జగన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సాగుచేస్తున్న పంటలు ఈ–క్రాప్‌లో నమోదు చేయకపోవడంపై ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో ప్రభుత్వంలో స్పందన వచ్చింది. సెలవు అయినప్పటికీ శని, ఆదివారాల్లో ఈ–పంట నమోదు చేయాలని జిల్లా యంత్రాంగం వ్యవసాయ సహాయకులపై ఒత్తిడి చేస్తోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో సచివాలయ ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఈ–క్రాప్ నమోదు చేస్తున్నారు.